ఘనంగా ఓటరు దినోత్సవం

- ఊరూరా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు
- పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు



బెల్లంపల్లి: ర్యాలీ తీస్తున్న అధికారులు, విద్యార్థులు

దండేపల్లి: జాతీయ ఓటరు దినోత్సవాన్ని దండేపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ఓటరు అవగాహన ర్యాలీ తీశారు. బస్టాండ్ వద్ద విద్యార్థులు, అధికారులు అంతా కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో మల్లేశం, డీటీ విజయ, ఆర్ఐలు భూమన్న, చంద్రమౌళి, ఎంపీవో శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, ఎంపీటీసీ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


దండేపల్లిలో ఓటరు ప్రతిజ్ఞ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద ర్యాలీని ప్రారంభించి కాంటా చౌరస్తా వరకు చేపట్టారు. ఓటరు నమోదు, ప్రాముఖ్యత పై వయోజనులకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఉన్న విలువను వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటేత్తుదాం అనే నాటికను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇతర విద్యా సంస్థల్లోనూ ఓటరు దినోత్సవాన్ని జరుపుకున్నారు. మైనార్టీ బాలికల గురుకుల కళాశాల ఆధ్వర్యంలోనూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు, ఎంపీడీవో రాజేందర్, ఎంఈవో మహేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

లక్సెట్టిపేట: విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని ఆర్డీవో రాములు అన్నారు. మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల అధికారులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వయోజనులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు అనేది వజ్రాయుధం లాంటిదన్నారు. మంచి రాజకీయ నాయకులను ఎన్నుకున్నప్పుడే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. విద్యార్థులచే పట్టణంలో ప్రధాన రహదారులలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు రాఘవేంద్రరావు, సంధ్యారాణి, సతీష్, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఖైకిషన్ ఓజా విద్యార్థులు అధికారులు పాల్గొన్నారు.



జన్నారంలో...



జన్నారం: మండల కేంద్రంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంఈవో విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ఓటర్ ప్రతిజ్ఞ చదివారు. ఆర్ఐ భానుకిరణ్, హెచ్‌ఎంలు రాజమౌళి, సత్యనారాయణ, సతీశ్‌గౌడ్, సర్పంచ్ కార్తిక్‌రావు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో...



చెన్నూర్: ఓటు హక్కుతో మంచి నాయకున్ని ఎన్నుకునే అవకాశం ఉంటుందని చెన్నూర్ ఎన్నికల అధికారి సిడాం దత్తు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఆర్వో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని కోరారు. డీటీ లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం అబ్దుల్ హమీద్, దేవ్‌రావు, పీడీ ఫనిరాజా పాల్గొన్నారు.

హాజీపూర్‌లో...



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గ్రామ పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు మండల కేంద్రంలో ఓటరు దినోత్సవ వేడుకలు జరిపారు. ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న నూతన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులను అందజేశారు. హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఎంపీడీఓ అబ్దుల్‌హై, నాయబ్ తహసీల్దార్ హరిత, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, గిర్దావర్‌లు మంగ, ప్రభు, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లు, బీఎల్‌ఓస్, నూతన ఓటర్లు, ప్రజలు పాల్గొన్నారు.


కాసిపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్, విద్యార్థులు

కాసిపేటలో...

కాసిపేట: మండల కేంద్రంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో ఎంఏ అలీం ఆధ్వర్యంలో మోడల్‌స్కూల్, ముత్యంపల్లి జెడ్పీ పాఠశాలల విద్యార్థులతో అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ అంది నాగమల్లయ్య, డెప్యూటీ తహసీల్దార్ మాణిక్‌రావు, ఎంఆర్ఐ సులోచన, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాండూర్‌లో...

తాండూర్: ఓటు హక్కును 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. అధికారులు, విద్యార్థులు, సిబ్బంది కలిసి తహసీల్దార్ కార్యాలయం నుంచి మాదారం పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, ఎంపీవో సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ తీస్తున్న విద్యార్థులు ,అధికారులు



కన్నెపల్లి హైస్కూల్‌లో ఓటరు ప్రతిజ్ఞ

భీమిని, కన్నెపల్లి మండలాల్లో...

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అధికారులు స్థానిక పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు బికర్ణదాస్, దత్తుప్రసాద్‌రావు, ఎంపీడీఓలు జవహర్‌లాల్, రాధాకిషన్, డీటీ గోవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మందమర్రిలో...



మందమర్రిరూరల్: మందమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఓటరు అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ హాజరై ప్రారంభించారు.

వేమనపల్లిలో...



వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవం నిర్వహించారు.

క్లుప్తంగా

సోమేశ్వర ఆలయంలో పూజలు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ సహిత సోమేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ లింగం వద్ద పాణవాటం భిన్నం(పగలడం) ఏర్పడంతో పూజలు చేపట్టారు. వేద పండితుడు ముద్దు ధీరజ్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ పుణ్యాహవాచనం, గణపతి పూజ, హోమం, కలశ కర్షణ, పూజా పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. గ్రామంలో పంటలు సంవృద్ధిగా పండాలని, ఎలాంటి ఆపదలు వాటిల్లొద్దని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్‌గౌడ్, సోమేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, దాత జనార్దార్ దంపతులు, ఆలయ పూజారి మహదేవ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోటపల్లి: స్థానిక మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశం కోసం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 22వరకు మీ దగ్గరలోని మీసేవ, నెట్ సెంటర్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎగ్జామ్ ఫీజు జనరల్ రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.125 ఉంటుందని పరీక్ష ఏప్రిల్ 7న ఉంటుందని వివరించారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సురేఖకు సత్కారం

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గురువారం నిర్వహించిన బూత్ లెవల్ కన్వీనర్ల శిక్షణ శిబిరంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖను మెమెంటోతో సత్కరించారు. కాంగ్రెస్ గతేడాది చేపట్టిన డిజిటల్ సభ్యత్వంలో రాష్ట్రంలోనే అత్యధిక సభ్యత్వాలను చేసినందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జి దీపాదాస్ మున్షి చేతుల మీదుగా మెమెంటోను అందుకున్నారు.

'విపత్తులను ధైర్యంగా ఎదుర్కోవాలి'

మంచిర్యాలఅర్బన్: విపత్తులు వచ్చినప్పుడు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ విజయవాడ కమాండెంట్ బీటెన్‌సింగ్ అన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, జిల్లా విద్యాశాఖ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, మండల విద్యాధికారి పోచయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయోధ్యకు కాలినడకన డిగ్రీ విద్యార్థులు

బెల్లంపల్లి: వరంగల్ జిల్లాకు చెందిన ఇద్దరు డిగ్రీ విద్యార్థులు అయోధ్యలోని బాల రాముడిని దర్శించుకునేందుకు కాలినడకన ప్రయాణం అయ్యారు. వరంగల్ జిల్లా ముల్కనూర్ గ్రామానికి చెందిన ఏను అరవింద్, మోకిడి ఆకాష్ అనే విద్యార్థులు గురువారం బెల్లంపల్లికి చేరుకున్నారు.

విచారణ చేపట్టాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల మీద నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న ఎన్‌హెచ్ 363నేషనల్ హైవే రోడ్డు శ్రీనివాస్ గార్డెన్ నుంచి క్యాతన్‌పల్లి వరకు అభివృద్ధి పనుల కోసం డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేశారని దీనిపై విచారణ చేపట్టాలని కోరుతూ స్వచ్ఛంద పూర సేవ సమితి కార్యదర్శి తుల మధుసూదన్‌రావు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. డీఎంఎఫ్‌టీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలన్నారు.

28న ఎన్నికలు

చెన్నూర్: ఈ నెల 28న నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ చెన్నూర్ శాఖ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పొన్న మల్లయ్య తెలిపారు. స్థానిక అటవీ శాఖ కాంప్లెక్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించిన సభ్యత్వ జాబితాను విడుదల చేశారు.

నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం పెట్టకపోవటం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం డీఈవో యాదయ్య, ఎంఈవో పోచయ్యలకు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు.

ఆర్థిక సాయం

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తాత్కాలిక అటెండర్‌గా పనిచేసి అనారోగ్యంతో మరణించిన జిల్లపెల్లి నర్సయ్య కుటుంబానికి పాఠశాల ఉపాధ్యాయులు రూ.30వేలు, పాఠశాలలో చదివిన 1990–91 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.10వేలు, మొత్తం రూ.40వేలను స్థానిక గ్రామీణ బ్యాంకులో నర్సయ్య కూతురు వైష్ణవి పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

మున్సిపల్ సమావేశంలో ఏడు తీర్మానాలు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొత్తం ఏడు అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.2లక్షలతో క్రికెట్ కిట్స్ కొనుగోలు చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లకు ఇన్సూరెన్స్ రెన్యూవల్ చేసేందుకు రూ.3.82లక్షలను సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు, ఏఈ అచ్యుత్, రెవెన్యూ అధికారి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ వెంకటనారాయణ

'నీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు'

చెన్నూర్: నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా పైపులైన్ల లీకేజీ సమస్యలు తలెత్తకుండా వెంటనే మరమ్మతు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రాంలాల్‌గిల్డా అన్నారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అభివృద్ధి పనుల తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. కాలనీలలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన మోటార్లు, పారిశుధ్య వాహనాల రిపేర్లు చేయించాలని పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన టెంట్‌హౌజ్‌ల బిల్లులను చెల్లించేందుకు సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


చెన్నూర్ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం

వ్యాసరచనలో కుశ్నపల్లి విద్యార్థినికి బహుమతి

నెన్నెల: వ్యాసరచన పోటీల్లో కుశ్నపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని హారిక జిల్లా స్థాయిలో తృతీయ బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం ఇందర్‌సింగ్ తెలిపారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని బిర్లా సైన్స్ సెంటర్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. 'ఓటు ఫర్ షూర్' అనే అంశంపై విద్యార్థిని బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థినికి కలెక్టర్ బదావత్ సంతోష్ చేతుల మీదుగా ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసా పత్రం అందజేశారు.


ప్రశంస పత్రం అందుకుంటున్న విద్యార్థిని హారిక

ఒలంపియాడ్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ప్రిన్సిపాల్ జోబిన్

మంచిర్యాలఅర్బన్: ఒలంపియాడ్ క్యాట్ లెవల్–2 ఫలితాల్లో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డిసెంబర్ 2023లో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్ లెవల్ –2వ (క్యాట్)లో 93మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జోబిన్ తెలిపారు. ఇందులో నగదు బహుమతి (క్యాష్‌అవార్డు) –10, మెరిట్ సర్టిఫికెట్–30, మెడల్స్ –53మంది అందుకున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

'దీక్ష శిబిరం తొలగించడానికి కుట్ర'

మందమర్రిరూరల్: సింగరేణి యాజమాన్యం గైర్హాజర్ పేరిట అక్రమంగా తొలగించిన వారు ఉద్యోగావకాశం కోసం దీక్ష శిబిరం ఏర్పాటు చేసుకుని 7178రోజులుగా దీక్ష చేస్తుంటే, యాజమాన్యం దీక్ష శిబిరాన్ని తొలగించే కుట్ర చేస్తుందని నాయకులు అంజన్న మండిపడ్డారు. దీక్ష శిబిరం వద్ద గురువారం యాజమాన్యం గోడ నిర్మాణానికి పూనుకోగా, డిస్మిస్ కార్మికులు అడ్డుకున్నారు. పలు కార్మిక సంఘాలు వారికి మద్దతుగా నిలిచాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మానవతా దృక్పథంతో సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి డిస్మిస్ కార్మికులందరికీ, తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్మిక సంఘం నాయకులు చొరవ తీసుకోవాలని కోరారు. నాయకులు, డిస్మిస్ కార్మికులు పాల్గొన్నారు.

'ఏబీవీపీ నాయకులపై దాడి అప్రజాస్వామికం'

తాండూర్: ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ, ఇతర నాయకులపై పోలీసులు లాఠీచార్జీ చేయడమే కాక వారిపై అనుచితంగా వ్యవహరించడం అప్రజాస్వామికమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ ఉద్యానవన వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దని, జీవో నంబర్ 55ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని నిరసన తెలిపిన ఏబీవీపీ నాయకులపై పోలీసులు అత్యంత క్రూరంగా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ దాడికి కారణమైన వారిపై వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం యూనివర్సిటీ భూములను కాపాడాలని శ్రీ కృష్ణ దేవరాయలు డిమాండ్ చేశారు.

ఏబీవీపీ శ్రేణుల రాస్తారోకో

బెల్లంపల్లి: వ్యవసాయ ఉద్యాన వర్సిటీ భూములను హైకోర్టు భవన నిర్మాణాలకు కేటాయించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేసిన ఏబీవీపీ నాయకులపై పోలీసులు లాఠీచార్జీ చేసినందుకు నిరసనగా గురువారం బెల్లంపల్లిలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కాంటా చౌరస్తా వద్ద ఏబీవీపీ శ్రేణులు రాస్తారోకో చేసి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. బాధ్యులైన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.


రాస్తారోకో చేపడుతున్న నాయకులు

టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు

వేమనపల్లి: టీఎన్‌జీఓ యూనియన్ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో గురువారం టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు నిర్వహించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బాపురావు, డీటీ గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

ఓటు విలువ తెలిసేలా ముగ్గుల పోటీలు

మంచిర్యాలటౌన్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అండాలమ్మ కాలనీలో సఖీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వయోజన విద్య, సఖీ లయన్స్ క్లబ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ముగ్గులు వేశారు. అనంతరం గెలుపొందిన మహిళలకు ముఖ్య అతిథిగా హాజరైన ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి శైలజ, వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, యువజన క్రీడల జిల్లా అధికారి శ్రీకాంత్ రెడ్డి, సఖీ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు బండ శాంభవి, సెక్రటరీ కరుణ, కోశాధికారి మెరుగు మహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ మంగ, లయన్స్ కార్యవర్గ సభ్యులు కట్ల భాగ్యలక్ష్మి, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ శోభ, జ్యోతి పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

మెప్మా ఆర్పీలకు వేతనాలు ఇవ్వాలని వినతి

మంచిర్యాలటౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న (రిసోర్స్ పర్సన్)ఆర్పీలకు గతేడాది జూన్ నెల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే వేతనాలు ఇచ్చేలా చూడాలని మంచిర్యాల మెప్మా ఆర్పీలు గురువారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. వేతనాలు రాక 7 నెలలు గడుస్తుండడంతో, కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు పర్వతి మంగ, ఎస్.నవిత, టి.స్వప్న, డి.సరిత, కె.అనూష, ఏ.మాధవి, పుష్పలీల, సబేరా బేగం పాల్గొన్నారు.

కోదండ రాంకు ఎమ్మెల్సీ ఇవ్వడంపై హర్షం

నెన్నెల: మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన ప్రొఫెసర్ కోదండ రాంకు ఎమ్మెల్సీ పదవీ ఇవ్వడం హర్షించదగ్గ విషయమని నెన్నెల మండల జేఏసీ కన్వీనర్ రణవీర్ సింగ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కోదండ రాం సంపూర్ణ మద్దతు ప్రకటించినందుకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు.

బడిబయటి పిల్లలు బడిలో చేరిక..

దండేపల్లి: బడిబయటి పిల్లల సర్వేలో భాగంగా దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్ హాబిటేషన్‌లో సీఆర్పీ నర్సయ్య చేపట్టిన సర్వేలో సంద మణికుమార్ అనే విద్యార్థిని గుర్తించారు. అతడిని దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతిలో గురువారం చేర్పించారు. మండలంలోని తాళ్లపేటలో సీఆర్పీ రాజ్‌మహమ్మద్ చేసిన సర్వేలో కోట రాజ్యలక్ష్మి అనే విద్యార్థిని గుర్తించి ఆమెను తాళ్లపేట ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పౌర్ణమి సందర్భంగా గోదావరి తీరంలోని గౌతమేశ్వర ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేసి, రైల్వే స్టేషన్ వద్ద నిరుపేదలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బూత్ లెవల్ శిక్షణకు కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గురువారం నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమానికి మంచిర్యాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి వాహనాల్లో హైదరాబాద్‌కు కాంగ్రెస్ శ్రేణులు వెళ్లారు.

భీమారం/మందమర్రిరూరల్: భీమారం, మందమర్రి మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సమావేశానికి శ్రీనివాస్, జావీద్‌ఖాన్, గక్కెల నరేష్, సొత్కు రాజం, సామ్యేల్, రజిత, రాధ, అనూష, పొడేటి రవి తదితరులు తరలివెళ్లారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

లక్సెట్టిపేట: తెలంగాణ స్టేట్ మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను మండలంలోని నాయకులు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కల్లెడ రాజశేఖర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, సర్వాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల :
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899